# బిచ్చగాడు?

కొత్తగూడానికి దగ్గరుండే ఒక ఊర్లో మా బంధువులింట్లో జరిగిన పెళ్లి అటెండ్ చేసి తిరిగి వరంగల్‌కు బయల్దేరాను. కొత్తగూడెంనుంచి బెల్లంపల్లికి వెళ్లే సింగరేణి ఎక్స్‌ప్రెస్‌లో వెళితే ప్రయాణం సుఖంగా ఉంటుందని తెల్లారకట్ల నాలుగ్గంటలకే లేచి నేను వెళ్లిన ఊర్నించి నాలుగున్నరకు కొత్తగూడెం వెళ్లే బస్సెక్కి కొత్తగూడెం చేరేటప్పటికి ఆరుంబావు అయింది. ట్రెయిన్ బయల్దేరటానికిక పదిహేను నిముషాల టైమ్ మాత్రమే ఉంది.

త్వరగా బస్సు దిగి స్టేషన్‌కు పరిగెత్తాను. వెంటనే టికెట్ తీసుకొని ట్రెయి నెక్కాలన్న ఆతురతతో వున్న నేను బుకింగ్ ముందున్న చేంతాండంత క్యూను చూసి గతుక్కుమన్నాను. ప్లాట్‌ఫారంమీద ట్రెయిన్ రెడీగా వుంది. ఎట్టి పరిస్థితుల్లో కూడా యింకో పదిహేను నిముషాల్లో నాకు టికెట్ దొరకడం అసంభవ మనిపించింది. అయినా చేసేదేమీ లేదు. కాబట్టి క్యూలో నిల్చున్నాను. క్యూలో చాలాసేపు నిల్చోవటమంటే నాకు చాలా చిరాగ్గా ఉంటుంది.

క్యూ చాలా మెల్లగా కదుల్తోంది. రెండు మూడు నిముషాల్లోనే నా వెనుక మరో పదిమందిదాకా వచ్చి నిలుచున్నారు.

క్షణక్షణానికి నా ఓపిక నశించిపోతోంది... టికెట్ కలెక్టరుకు చెప్పేసి ట్రెయినెక్కేద్దామా అనుకున్నాను. ట్రెయిన్ బయలుదేరటానికిక ఐదునిమిషాలు మాత్రమే ఉంది.

''మీరెక్కడకెళ్లాలిసార్'' అంటూ నన్నే పలకరించినట్లుగా వినిపించడంతో పక్కకు తిరిగాను. నీట్‌గా డ్రెస్ చేసుకున్న ఓ పాతికేళ్ల యువకుడు నాకేసి చిరునవ్వుతో చూస్తూ –

''నన్ను గుర్తుపట్టలేదా?'' అన్నాడు.

''లేదు'' అన్నాను. అతడెవరో గుర్తుచేసుకోవటానికి ప్రయత్నం చేస్తూ

''నేను మీ స్టూడెంట్‌ని సార్. వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో చదివాను. ప్రస్తుతం పాల్వంచలో ఎస్.ఐగా పనిచేస్తున్నాను''

''నిజంగానా? నీపేరు?'' అన్నాను. ఆశ్చర్యంగా. అతన్నింకా గుర్తుచేసు కోవడానికి ప్రయత్నిస్తూ –

''భాస్కర్ సార్! మీరు ఎందాక వెళ్లాలో చెప్పండి సార్... టికెట్ తెప్పిస్తాను. టైం లేదు''

అన్నాడతడు.

చేతిలో వున్న పది రూపాయల నోటు అతని చేతికిస్తూ వరంగల్ అన్నాను.

భాస్కర్ బుకింగు దగ్గిరున్న కానిస్టేబుల్‌ను పిలిచి వరంగల్ కొక టికెట్ తీసుకోమని చెప్పాడు. ఎక్కడ్నించో అకస్మాత్తుగా ఊడిపడి నన్ను క్యూ నుండి విముక్తుణ్ణి చేసిన అతడెవరో పోల్చుకోవడానికి నా జ్ఞాపకశక్తి పెనుగులాడుతూనే ఉంది. నేను లెక్చరర్‌గా జాయినయినప్పటినుంచి కొన్ని వందలమంది స్టూడెంట్స్ కాలేజీలోంచి డిగ్రీలు పుచ్చుకుని బయటకు వెళ్లి ఉంటారు. ఎంతమందినని గుర్తుంచుకోవటం? బాగా ఒడ్డూ పొడుగూ ఉన్న ఈ భాస్కర్ గుర్తొచ్చినట్టే వచ్చి మళ్లీ మాయమైపోతున్నాడు. అకస్మాత్తుగా నా దృష్టి భాస్కర్ చేతిలో వున్న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మీదకు మళ్లింది. లాస్ట్‌పేజీలో ఉన్న గవాస్కర్ ఫోటో చూడగానే -

''నువ్వు కాలేజీలో చదువుతుండే రోజుల్లో క్రికెట్ బాగా ఆడుతుండేవాడివి కదూ భాస్కర్?'' అన్నాను బోల్డు రిలీఫ్‌తో.

''ఔను సార్... యూనివర్శిటీ ప్లేయర్‌గా కూడా సెలక్టయ్యాను...''

''యెస్... నౌ ఐ రిమెంబర్ యూ వెరీవెల్. మన కాలేజీలో జరిగిన నువ్వాడిన ఒక క్రికెట్ మ్యాచ్‌లో నేను కొంతసేపు కామెంటరీకూడా చెప్పాను...''

''ఔనుసార్...'' అన్నాడతను.

ఇంతలో కానిస్టేబుల్ టికెట్ తెచ్చిచ్చాడు.

భాస్కర్ చేతిలోంచి ఆ టికెట్ అందుకుంటూ...

''థాంక్యూ భాస్కర్... థాంక్యూ వెరీమచ్'' అన్నాను.

''మీరు వెళ్లండి సార్. ట్రెయిన్ పూర్తిగా నిండిపోయింది. మీకు సీటు దొరుకు తుందో లేదో...'' అన్నాడతడు.

''నువ్వు రావటం లేదా భాస్కర్?'' అన్నాను.

''లేదు సార్... మా ఫ్రెండొకతన్ని సెండాఫ్ చెయ్యటాకొచ్చాను...'' అన్నాడు భాస్కర్.

అతనికి మరోసారి థాంక్స్ చెప్పి ప్లాట్‌ఫాం మీదకు పరిగెత్తాను - బుకింగ్ దగ్గర టికెట్లు కోసం జనం పోట్లాడుకోవడం భయంకరంగా మారింది. ఆ తొక్కిసలాటలోంచి అంత త్వరగా బయటపడినందుకు నన్ను నేను అభినందించు కుంటూ ప్లాట్‌ఫారం మీదకు చేరి సీటు కోసం ఒక కంపార్ట్‌మెంట్ తర్వాత మరో కంపార్ట్‌మెంట్ వెతకసాగాను - ఎక్కడా సీటు దొరికే ఆశ కనిపించలేదు. ఇక వెతకటంవల్ల ప్రయోజనం లేదని ఒక కంపార్ట్‌మెంట్ ఎక్కిఎక్కడైనా కాస్త చోటు దొరుకుతుందేమోనని, మళ్లీ ఎవరైనా భాస్కర్‌లాంటి వాళ్లు కలిసి సీటిస్తారేమోనని లోపల కూర్చున్న వాళ్లందర్నీ ఒకసారి పరీక్షించాను - నన్నెవరూ ఆహ్వానించేవాళ్లు కనిపించలేదు. కాని నా దృష్టి ఒక సీటుమీద పడింది. ఐదుగురు

సులభంగా కూర్చోగల్గిన ఆ సీటు మొత్తాన్ని ఒకావిడ బోల్డు లగేజీతో ఆక్రమించుకుంది. ఆ లగేజ్‌ని కొంచెం అటూ ఇటూ జరిపితే అక్కడ ఈజీగా కూర్చోవచ్చునని ఆ సీటు దగ్గరకెళ్లాను.

అక్కడ కూర్చున్నామె ఎవరో చాలా పేదరాలిలా ఉంది. చిరిగి వేలాడుతున్న బట్ట పీలికల్ని కట్టుకున్న ఆమె బిచ్చపుదానిలా ఉంది. ఆమెకు ఎదురుగా ఉన్న సీటుమీద ఇద్దరమ్మాయిలు, ఇద్దరబ్బాయిలు కూర్చుని ఉన్నారు. వాళ్ల శరీరాల మీదకూడా చిరిగిపోయిన బట్ట పీలికలు వేలాడుతున్నాయి. వాళ్లు ఆమె సంతానమని గ్రహించటానికి నాకెంతో టైమ్ పట్టలేదు - వాళ్లంతా చాలా మురికిగా, అసహ్యంగా ఉన్నారు. వాళ్ల శరీరాలనుండి వెలువడుతున్న చెమట కంపు దుర్భరంగా ఉంది. వాళ్ల పక్కన కూర్చోవటమంటే చాలా భయమేసింది. కానీ మరో గత్యంతరం లేదు - మూడు గంటలు నిల్చోవటం కంటే ఎలాగో అలా వాళ్ల పక్కన కూర్చోవటమే నయమనిపించింది -

''ఇదిగో ఇటు చూడు... ఈ సామానంతా కిందపెట్టేస్తే ఇక్కడ ఇంకో ఇద్దరు ముగ్గురు కూర్చోవచ్చు -'' అన్నాను ఆమెతో చాలా మర్యాదగా.

''గదంతేంలేదు. మేము సామాను తియ్యం... ఇంకో డబ్బులకు బోయి కూకో... మేమే దొరికినామా?'' అందామె చాలా మొరటుగా - తైల సంస్కారంలేక వరిగడ్డిలా ఉన్న వెంట్రుకలు... గారపట్టిన పళ్లు.... లోతుకు పీక్కుపోయిన చిన్న చిన్న కళ్లు... గర్భంతో ఉందని చాటి చెబుతున్న ఆమె పొట్ట... ఎందుకో ఆమెను చూస్తే మొత్తం స్త్రీ జాతిమీదనే అసహ్యం కల్గే ప్రమాదముందనిపించింది. వెంటనే అక్కణ్ణించి వెళ్లిపోదామనుకున్నాను. కాని అక్కడ కూర్చున్న ప్రయాణికుల్లో ఒకాయన -

''అధునా బిచ్చపు ముండవు... నీకే గింత పొగరుంటే మా కెంతుండాల్నే? ఆ సారెంత మర్యాదగా అడిగిండు? ఆ సామాను కొంచెం కిందబెడ్తే మాసిపోతాదే! ఈ రైలు నీ తాతదనుకున్నావా? తండ్రిదనుకున్నావా? ఆచెత్తంతా తీసి కిందబెట్టి సారును కూర్చోనియ్'' గద్దించినట్టుగా అన్నాడు.

ఆయన వేసుకున్న ఖద్దరు బట్టల్ని బట్టి చూస్తే ఆయనెవరో పెద్ద రాజకీయ నాయకుడిలా ఉన్నాడు -

ఆయనలా జోక్యం చేసుకోవటంతో ఆమె కాస్త తగ్గింది - సీటు మీదున్న ఎన్నో మూటల్లోంచి ఒక మూటను మాత్రం తీసి కిందబెడ్తూ -

''మావోడు టిక్కెట్టుకు బోయిండు... ఆడొత్తే సీటు కావద్దా? ఆడికోసమే ఆపినం'' అందామె నన్నక్కడ కూర్చోమన్నట్టుగా చూస్తూ -

పైన సూటుకేసు పెట్టి ఆ కాస్త చోటులో సర్దుకుని కూర్చున్నాను. నా ముందు సీట్లో కూర్చున్న ఆమె పిల్లలందరూ నావేపు శత్రువును చూసినట్లుగా చూస్తున్నారు - వాళ్లు ఎంతో కష్టపడి నిర్మించుకున్న వాళ్ల ఆ భూభాగంమీద నేను దురాక్రమణ చేశానన్నట్టుగా ఆ

పసిపిల్లలు నన్ను చూస్తున్నారన్న భావం నా మనసులో మెదలటంతో కొంచెం గిల్టీగా ఫీలయ్యాను.

అక్కడ సీటుమీద, కిందా కుప్పలు తెప్పలుగా పడివున్న వాళ్ల లగేజీ నొకసారి పరీక్షగా చూశాను. వాళ్లు ఎక్కణ్ణించో బిచాణా ఎత్తేసి మరోచోటికి వెళ్లిపోతున్నట్లుగా తోచింది. వంటపాత్రలు, చింకిచాపలూ, బొంతలు, మంచం పట్టెలు, కోళ్లు, పాత గొడుగులు, లాంతర్లు, ఖాళీసీసాలు, కిరోసిన్ డబ్బా, పొయిల కట్టెలు - ఇలా యేవేవో అస్తవ్యస్తంగా పడి ఉన్నాయి.

ఇంతలో గార్డు విజిల్ వినిపించింది - టైమ్‌చూశాను. ఆరు ముప్పయి ఐదు - ఐదు నిమిషాలు లేటు - మరుక్షణంలో రైలు కూసింది.

''మీ అయ్యేడ్రా? ఎక్కడ సచ్చిండురా? రైలు పోతాంది....'' ఆతురతగా, ఆందోళనగా ధ్వనించింది ఆమె గొంతు.

టికెట్ల కోసం వెళ్లిన ఆమె భర్త ఇంకా రాలేదు.

కిటికీలోంచి బయటకు చూశాను. బుకింగ్ దగ్గర ఇంకా జనం చాలామందే ఉన్నారు.

ఇంతలో ఒక మధ్య వయస్కుడు మేము కూర్చున్న కంపార్టుమెంట్‌వైపు పరుగెత్తుకుని రావటం గమనించాను. అతన్ని చూడగానే నా ముందు కూర్చున్న పిల్లలు లేచి నిల్చొని సంతోషంతో కేరింతలు కొడ్తూ -

''అయ్యొస్తాండు... అయ్యొస్తాండు'' అని అరిచారు.

పరుగెత్తుకొస్తున్న ఆ వ్యక్తి లబోదిబోమని మొత్తుకుంటూ ''టికెట్లు దొరకలేదు... బండిపోతాంది. సామానంతా కిందికి దించి మీరు దిగండే'' అన్నాడు.

ఆ మాట వినగానే ఆ పిల్లలూ, ఆమె పెద్దపెట్టున యేడ్వసాగారు.

మళ్లీ ఇంటాకటి పెద్దమనిషే జోక్యం చేసుకున్నాడు.

''అరెవోరి పిచ్చి గాడిద కొడకా! నీ ఈ బండెడు సామాను దించేదాకా బండి ఆగుతాదిరా! టిక్కెట్లు లేకుండ ఏమనుకోని ఎక్కినావురా?... టి.టి. గారితోని చెప్పి ఎక్కుపో'' అన్నాడు..

''అక్కడ మావోనికి టిక్కెట్లు తీసుకోమని పైసలిచ్చొచ్చినయ్యా! ఇప్పుడు నేను బండెక్కితే ఆ పైసలటేపోవు?'' అన్నాడతడు మళ్లీ బుకింగ్ దగ్గరకు పరిగెడ్తూ...

ట్రెయిన్ మళ్లీ విజిలిచ్చి, మెల్లిగా కదిలింది.

అతడు ట్రెయినెక్కకుండా మళ్లీ బుకింగ్ దగ్గరకు పరుగెత్తటంతో, అతని పిల్లలు, అతని భార్యా మళ్లీ పెద్దపెట్టున యేడవసాగారు.

''మీరు కూడా దిగిపోవడం మంచిది. టి.టి. వచ్చాడంటే మీమీద బోల్డు ఫైనేస్తాడు'' అన్నారు ప్రయాణికుల్లో మరొకరు.

''ఇంత లగేజీ పెట్టుకుని ట్రెయిన్ మూవయ్యాక ఎలా దిగుతారండి?'' అన్నాన్నేను.

''ఆడు పోతేపోయుండులే - మళ్లొచ్చే బండ్లొ వస్తడు. దబ్బున టి.టి. వస్తే ఫైన్ కట్టానికి నీ దగ్గర పైసలేమన్న ఉన్నయా లెవ్వా?'' అన్నాడు ఇందాకటి నాయకుడు.

''అయ్య దొరో! ఒక్క పైసన్నా లేదు బాంచెను'' అందామె యేడుస్తూనే-

''నువ్వట్లనే అంటవు... ఇయ్యాల్రేపు బిచ్చగాళ్ల దగ్గరున్నన్ని డబ్బులు మా అసంటోళ్ల దగ్గరకూడా ఉంటలేవు... మీకేందే. పెట్టుబడిలేని వ్యాపారం'' అన్నాడతను.

అక్కడ కూర్చున్నవాళ్లంతా నవ్వారు.

'పాపం... వాళ్లలా బిక్కచచ్చి యేడుస్తుంటే మీరిలా నవ్వటమేమిటి?' అని వాళ్లందర్నీ గద్దించాలనిపించింది. కాని నేనలా అంటే వీడెవడో పిచ్చివాడులా ఉన్నాడని వాళ్లంతా మళ్లీ నవ్వుతారేమోనని భయమేసి ఊరుకున్నాను.

ట్రెయినింకా వేగాన్ని పుంజుకోలేదు.

ఇందాక టికెట్ల కోసం వెళ్లిన ఆమె భర్త ప్లాట్‌ఫాంమీద వేగంగా పరుగెత్తుకు రావటం చూశాం... యేడుస్తున్న అతని పిల్లలు వాళ్ల తండ్రిని చూడగానే యేడ్వటం మానేసి ''అయ్యా! అయ్యా!' అని అరిచారు.

అతడు పరుగెత్తుకొని వచ్చి ఆ కంపార్ట్‌మెంట్ ఎక్కేశాడు. ఆ పిల్లల గుండెలు కుదుటపడ్డాయి. అతడు మేము కూర్చున్న సీటు దగ్గరకు వచ్చాడు.

అతడు విపరీతంగా వగురుస్తున్నాడు...

అతనికి యాభయ్యేళ్లుండొచ్చు... తలకు రుమాలు చుట్టుకున్నాడు. బాగా పెరిగిన గడ్డం - సగం నెరిసింది. గుబురుగా పెరిగిన మీసాలు - చింతనిప్పుల్లా ఎర్రగా మండుతున్నట్టున్న కళ్లు - అతన్ని చూస్తే చాలాకాలంగా ఏదో జబ్బుతో పెనుగులాడుతున్నట్లుగా తోస్తుంది. చాలాచోట్ల గుంతలుపడిన బనియన్, మోకాళ్లపైకి కట్టుకున్న పంచె... అతడు దగ్గరకు రాగానే చుట్టకంపు...

అతన్ని చూడగానే అతని భార్య ''టిక్కెట్లు దెచ్చినావా?'' అంది.

''ఎక్క డెచ్చిన? తెస్తనని అటురికెటోర్కె బండి కదిలె... బండి కదలంగనే నేను మళ్ల ఇటు మర్లిన... టికెట్లు బోయినయి...పైసలు బోయినయి...'' అన్నాడతను.

''ఇప్పుడు టి.టి. వస్తే యేంజేస్తవురా'' అన్నాడు నాయకుడు.

''రెండుకాళ్లు బట్టుకుంట...''

''రెండుకాళ్లు బట్టుకుంటె ఆయన ఊర్కుంటాడ్రా''

''మరిగంతకన్న నాదగ్గరేముందయ్యా?'' అన్నాడతడు.

''మీ పనే బావుందిరా... ఎక్కడా బిచ్చమే... కానీ ఖర్చులేని బతుకు''

ఆ సంభాషణలో ఇంకా చాలామంది ప్రయాణికులు పాల్గొనడం మొదలెట్టారు.

''ఊళ్లన్నీ వాళ్లవే... దేశాలన్నీ వాళ్లవే... దొరికితే తింటారు. లేకపోతే పస్తుంటారు. యే బాదరబందీ లేదు, మనకంటే వాళ్లే నయం'' అన్నాడు ప్రయాణికుల్లో ఒకరు.

''ఆమధ్య పేపర్లో చదివాను. బిచ్చగాళ్లక్కూడా బ్యాంకు ఎకౌంట్లట... ఒక్కొక్కడి పేర ఐదువేలు... పదివేలు ఉన్నాయిట...'' అన్నాడు మరొకాయన.

''టి.టి.గాని వస్తే వీళ్లచేత ఫైన్ కట్టించటమో లేక పక్కస్టేషన్లో దించటమో తప్పనిసరి'' ఇంకొకాయన.

''ముదనష్టపోడు... గంటసేబ్బొయిండు... టిక్కట్టు తేకుండనే వచ్చిండు.. పైసలుకూడా ఎవనికో ఇచ్చొచ్చిండట...'' అంటూ రాగాలు తీయసాగింది అతని భార్య.

''టికట్ల దగ్గర జనమంతా ఇరగబడ్డరు... నన్నేం జెయ్యమంటవే... మనతో రాలే... మా అన్న కొడుకు... పైసలు ఆడికిచ్చిన టికెట్లు తీసుకోమని... నేనేమో బండిని జూత్తా నిలబడ్డ...'' అన్నాడతడు.

''అయ్యో నీ చేతులిరగిపోను! పైసలా దొంగసచ్చినోని కిచ్చినావా? ఆడినెట్టా నమ్మినవయ్యా... అయ్యో! అయ్యో! ముప్పై రూపాయలు!'' అతని భార్య గుండెలు బాదుకోసాగింది.

''ఆ టికెట్లకు బోయినోడు కూడా మీతో రావలసినోడేనా?'' అడిగాడు నాయకుడు.

''కాదు బాంచెను – ఆడు పాలంచలో ఉంటాడు – మమ్ముల బండెక్కిత్తనని వచ్చిండు – ప్యాణం బాగాలేక దవాఖాన కొచ్చిన బాంచను – రెండు నెల్లనుంచి దగ్గు... ఒకటే దగ్గు...'' అంటూ అతడు ఖంగు ఖంగుమని దగ్గటం మొదలెట్టాడు.

''ఆ డా ముప్పై రూపాయలు తీసుకుని సారా కొట్టుకు బోతాడు. నీకు ఒక్క పైసా కూడా జూపించడు'' అంది అతని భార్య.

''ఆడసంటోడు కాడులేవే... ఆడు టికెట్లు తీసుకుంటడు...''

''బండిపోయినంక టిక్కెట్లు తీసుకుని యేం లాభంరా? టిక్కెట్లు తీసుకున్నాను. బండిబోయింది అని వాడు స్టేషన్ మాస్టరుకన్నా చెప్తే ఫర్వాలేదు కాని వాడికామాత్రం తెలుసా అని?'' అన్నాడు నాయకుడు.

ఇంతలో ఏదో స్టేషనొచ్చింది.

ట్రెయిన్ ఆగింది. మా కంపార్ట్‌మెంట్‌లోకి టి.టి.ఐ రానే వచ్చాడు.

టి.టి. వచ్చాడని తెలియగానే ఆమె ఏడ్వటం మొదలెట్టింది. ఆమెను చూసి వాళ్ల పిల్లలు కూడా యేడ్వటం మొదలెట్టారు.

''ఇక్కన్నే.. ఈ అడవిన్లే దింపేస్తడు'' అన్నాడు ప్రయాణికుల్లో ఒకాయన.

''అంత పనిచెయ్యడ్లే... పక్కస్టేషన్లో దింపుతాడు'' అన్నారింకొకరు.

ఒక్కొక్క ప్రయాణికుని దగ్గర టికెట్ చెక్ చేస్తూ టి.టిగారు మా వరుసకి రానే వచ్చాడు. అక్కడ కూర్చున్నవాళ్లంతా టిక్కెట్లు చూపించారు.

ఆ బిచ్చగాడు మాత్రం చేతులు జోడించాడు.

"దండం పెట్టాల్సింది నాక్కాదురా! పైనవున్న దేవుడికే... దొంగవేషాలు చాలించి చూపించు టిక్కెట్లు" గద్దించాడు టి.టి.

"అయ్యా! టిక్కెట్ల కోసమే బోయినయ్యా... ఇయ్యాళ కొత్తగూడెం టేషన్లో అంతా మందే... టిక్కెట్లు తీసుకోమని మా అన్న కొడుకుని బంపిన... ఆడు చెయ్యి బెడ్తుండగనే బండి కదిలింది... నేను ఆణ్ణి వదిలేసి బండెక్కిన..."

అతడింకా చెబుతూనే ఉన్నాడు. కాని ఆ రైల్వే అధికారి అతని మాటల్ని వినిపించుకోలేదు.

"నోర్ముయిరా దొంగ వెధవ! మీ సంగతి మాకు బాగా తెలుసురా! ఎక్కడికెళ్లాలి మీరు?" అన్నాడు టి.టి.ఐ.

టి.టి.ఐ మధ్య వయస్కుడు. ఇలాటి విషయాల్లో చాలా అనుభవమున్న వాడిలా కనిపించాడు. బాగా దురుసుగా, కఠినంగా మాట్లాడటం అతనికి చాలా సహజమైన విషయంగా కనిపించింది.

"నెక్కొండ బాంచెను" అన్నాడతను.

"ఆ ఆడది, ఆ నల్గురు పిల్లలు నీ వాళ్లేనా" అన్నాడు టి.టి.

"అయ్యా! మావోళ్లే"

"అయితే 56 రూపాయలు తియ్..."

అతడు వెంటనే టి.టి. గారి రెండు కాళ్లు గట్టిగా పట్టుకున్నాడు.

"లే గాడిద కొడకా! నా కాళ్లెందుకురా పట్టుకుంటావు...? మర్యాదగా పైసలు తీస్తావా? పోలీసులకు పట్టించమంటావా?"

"నన్ను కోసినా నా దగ్గర పైసలేదు బాంచెను... ఉన్న పైసలన్నీ ఆడికే ఇచ్చొచ్చిన" అన్నాడతను.

"ఆ డెవడు?"

"మా అన్న కొడుకని చెప్పలేదండి. టికెట్లు దీసుకోమని ఆడికి ముప్పై రూపాయ లిచ్చిన్నుండి..."

అతడు మళ్లీ అతని కాళ్లు పట్టుకోబోయాడు - కాని అతడు దూరంగా జరిగి "నీ ఎత్తులన్నీ నా దగ్గర సాగవురా? 56 రూపాయలు తీస్తావా లేదా?" అన్నాడు.

ఇదంతా చూస్తున్న నాకు ఆ బిచ్చగాడి నెల్లాగైనా ఆదుకోవాలనిపించింది.

''టి.టి.గారూ! అతడు చెప్పింది వినిపించుకోరేమిటి? ఈరోజు నిజంగానే కొత్తగూడెంలో బుకింగ్ దగ్గర విపరీతమైన రష్‌గా ఉంది. అతడెవురికో డబ్బిచ్చాట్ట.... అతడు టికెట్లు తెచ్చేలోగానే ట్రెయిన్ కదిలింది. అతడి భార్యా పిల్లలు, లగేజీ ట్రెయిన్‌లో ఉండిపోయారన్న తొందర్లో అతడు ట్రెయినెక్కేశాడు...'' అన్నాను ఇంగ్లీషులో.

నేను ఇంగ్లీషులో మాట్లాడటంతో టి.టి.గారి కాఠిన్యం కొంచెం సడలింది.

''అయితే ఒక పని చేద్దాం. వచ్చే స్టేషన్‌నుండి నేను కొత్తగూడెం స్టేషన్ మాష్టారుకి ఫోన్ చేస్తాను - ఎవరైన నెక్కొండకు తీసుకున్న టికెట్స్ రిటర్న్ చెయ్యడానికి వచ్చారా అని అడుగుతాను... వీడిమాటే నిజమైతే ఆ టికెట్లు రిటర్న్ రావాలి కదా? రిటర్నొచ్చాయని స్టేషన్ మాస్టరు చెబితే వీడికి సమస్యే ఉండదు. ఒరే నీ పేరేమిట్రా?'' అన్నాడు టి.టి.

''బ్రహ్మయ్య బాంచెను'' అన్నాడు అతడు.

''నువ్వు కొత్తగూడెంలో డబ్బిచ్చినతని పేరేమిటి?''

''సోమయ్య బాంచెను'' అన్నాడు బ్రహ్మయ్య.

''అయిదు నిమిషాల్లో వీడు నాటకమే ఆడుతున్నాడో... నిజమే చెబు తున్నాడో తేల్చేస్తానుండండి'' అన్నాడు టి.టి.

కంపార్ట్‌మెంట్‌లో అందరూ యీ విషయాన్నే చర్చించసాగారు.

''వాడికి టికెట్లు రిటర్న్ చెయ్యాలని తెలుసో తెలీదో - బండెల్లిపోయింది కదా అని వాడూ వెళ్లిపోయుంటాడు'' అన్నాడొకాయన.

''అబ్బో! ఇవ్వాళరేపు అంత అమాయకులెవరూ లేరులెండి...'' అన్నాడింకొకాయన.

ఇంతలో మరో స్టేషన్ రానే వచ్చింది.

''వరే బ్రహ్మయ్యా! రారా'' అంటూ అతన్ని తన వెంట బయటకు తీసుకెళ్లాడు టి.టి.

ఆ కంపార్టుమెంట్‌లో కూర్చున్న ప్రయాణికులందరూ యేమవుతుందోనని ఆతురతతో ఎదురుచూడసాగారు.

''ఆ! వానికిగంత తెలివెక్కడేడ్చింది. బండి వెళ్లిపోయిందని టిక్కెట్లు జేబులబెట్టుకొని ఎల్లిపోయినా''

''వాడసలు టిక్కెట్లు తీసుకోనే తీస్కోడు. బండి కదిలింది చూసి డబ్బులు జేబులో వేసుకొని యెల్లిపోయినాలె''

అందరూ ఎవరికి తోచినట్లుగా వారు మాట్లాడటం మొదలెట్టారు.

''వాడు గసుంటోడే బాంచెను - సారా కొట్టుకు బోయినాలె'' అంది బ్రహ్మయ్య భార్య.

ఐదారు నిమిషాల్లో ట్రెయిన్ కదులుతుండగా బ్రహ్మయ్యతోపాటు టి.టి. ట్రెయినెక్కాడు.

''నేను చెప్పలేదండి అంతా నాటకమని - ఎవరూ టిక్కెట్లు రిటర్న్ చెయ్యటానికి రాలేదని కొత్తగూడెం స్టేషన్‌మాస్టరు చెప్పాడు. అరే బ్రహ్మయ్యా! తియ్‌రా డబ్బు!'' అన్నాడు టి.టి.

బ్రహ్మయ్య బోరుమని యేడ్వసాగాడు. అతనితోపాటే అతని భార్య, పిల్లలు కూడా యేడ్వడం మొదలెట్టారు.

''ఇలా యేడ్చి అల్లరి చేశారంటే చర్మం వలిపించేస్తాను... డర్టీ స్కౌండ్రల్స్... రోగ్స్... నోర్ముయ్యండి'' గట్టిగా అరిచాడు టి.టి. ఆ అరుపు వాళ్లను హడలగొట్టింది. వాళ్లంతా వెంటనే యేడ్వటం మానేశారు.

''వరేయ్ బ్రహ్మయ్యా! డబ్బు తియ్యరా!'' మళ్లీ అన్నాడు టి.టి.

''అయ్యా! నన్ను కోసినా నా వద్ద ఒక్క పైసా లేదయ్యా...'' అంటూ బ్రహ్మయ్య మళ్లీ టి.టి. గారి కాళ్లు పట్టుకోబోయాడు.

''నన్నంటుకున్నావంటే చంపేస్తాను... బద్మాష్! లుచ్ఛా! నీదగ్గర డబ్బు లేదురా! ఆ రుమాలు తియ్'' అన్నాడు టి.టి.

వెంటనే టి.టి.తో వచ్చిన మరొకతడు - అతని అటెండరనుకుంటాను బ్రహ్మయ్య తలకు చుట్టుకున్న రుమాలును లాగబోయాడు.

బ్రహ్మయ్య వెనక్కి జరిగి రెండుచేతుల్తోను తన రుమాలును గట్టిగా పట్టుకున్నాడు.

''ఈ రుమాల్నేముంది బాంచెను... మీ అసుంటి ఓ దొర దగ్గర అడుక్కున్న... నన్ను నమ్ముండ్రి బాంచెను. వచ్చే టేషనులో దింపుండ్రి బాంచెను...'' అంటూ ఖంగు ఖంగుమని భయంకరంగా దగ్గాడు బ్రహ్మయ్య. కాని అతని మాటల్ని వినిపించుకోకుండా ఆ రైల్వే అధికారి ముందుకు జరిగి బ్రహ్మయ్య రుమాలు లాగాడు - బ్రహ్మయ్య తన శక్తినంతా కూడదీసుకుని తన తల మీది రుమాలును రక్షించుకోబోయాడు. కాని అతని ప్రయత్నం ఫలించలేదు. వాళ్లిద్దరికి జరిగిన ఆ పెనుగులాటలో బ్రహ్మయ్య రుమాలు చిరిగిపోయింది - అందులోనుంచి మూడు పది రూపాయల నోట్లుకిందపడ్డాయి. వాటిని చూడగానే టి.టి. గారి కళ్లు మెరిశాయి. ప్రయాణికులంతా ఆ నోట్లుకేసి కళ్లప్పగించి చూశారు - ఇంతసేపు వాళ్ల హృదయాల్లో బ్రహ్మయ్యపట్ల యేకొంచెమన్నా సానుభూతి యేర్పడి ఉంటే అది ఆ క్షణంలో యెగిరిపోయింది.

''దొంగ ముండాకొడుకులు. వీళ్లను చచ్చినా నమ్మొద్దు. టి.టి. గార్కి వీళ్ల సంగతి బాగా తెలుసు. మంచి పని జేశిండు'' అన్నాడు ఖద్దరు బట్టల నాయకుడు.

ఆ క్షణంలో అక్కడ కూర్చున్న మిగతా వాళ్లందరూ సరిగ్గా అలాగే అనుకొని వుంటారు.

టి.టి.తో ఉన్న అటెండర్ ఆ మూడు పది రూపాయల నోట్లను తీసి టి.టి గారి చేతిలో పెట్టాడు. అతడు వెంటనే ఆ డబ్బును జేబులో కుక్కుకొని -

"ఈ వెయ్యిప్పై రూపాయలే కదురా నువ్వు టికెట్లు తీసుకోవుమని మీ అన్న కొడుక్కిచ్చావు?"

తన కంఠంలో సాధ్యమైనంత వెటకారాన్ని మేళవించి అన్నాడు టి.టి.

ప్రయాణీకులంతా గొల్లున నవ్వారు.

"కాదు మహాప్రభో! కాదు... ఆడికిచ్చిన డబ్బు ఆడిదగ్గరే పోయింది..."

"ఛట్! దొంగరాస్కెల్... ఇంకా మోసం చెయ్యాలని చూస్తున్నావా? తియ్... మిగతా 26 రూపాయలు కూడా తియ్..."

"మమ్ముల కొట్టుండ్రి... చంపుండ్రి... ఈ బండ్లెనించి బయటికు ఇసిరికొట్టుండ్రి... మావద్దిక పైసల్లేవు" ఈసారి బ్రహ్మయ్య భార్య అంది.

"నోర్మూయ్యవే దొంగముండా! పైసల్లేవంటే ఫైనెవ్వడు కడ్తడనుకున్నవ్...? నీ నడుముకున్న ఆ సంచి తియ్..." అన్నాడు టి.టి.

"దాంట్లేముంది బాంచెను... నిన్న మొన్న అడుక్కున్న బిచ్చపు డబ్బులు" అంది బ్రహ్మయ్య భార్య.

"ఏముందో నేను జూస్తాను... అదిటివ్వు" అన్నాడు టి.టి.

"ఈ పూటకు నూకలమందమున్నా ఉంచుండ్రయ్యా! నిన్నా మొన్నా యేమీ తిన్లేదు... ఆడు రోగంతో తీసుకొని తీసుకొని సచ్చిపోతాండు... నా పోరగాళ్లను సూడుండ్రి... ఆకలితో నకనకలాడిపోతాండ్రు... మీ కాళ్లు పట్టుకుంట బాంచెను..."

ఆమె లేచి అతనివైపు వెళ్లబోయింది.

నిండు చూలాలుగా ఉన్న ఆ నిర్భాగ్యురాల్ని చూస్తే అక్కడ కూర్చున్న వాళ్లకెవరికీ జాలి కల్గకపోగా వీళ్లకిలాగే జరగాలన్న ద్వేషపూరితమైన భావమేదో వాళ్లల్లో కల్గటం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇలాంటి దృశ్యాన్నే యే సినిమాలోనో చూపిస్తే వీళ్లంతా కంటతడి పెడ్తారు. ఈ మనుషుల్లోని ఈ వైరుధ్యాలకు కారణమేమిటి? మేమంతా టికట్లుకొన్నాము. వీళ్లే టికెట్లు కొనకుండా ప్రయాణం చేస్తున్నారు. మనకు లేని ప్రివిలేజిని వీళ్లెందుకు పొందాలన్న ఈర్ష్య కావచ్చు. వీళ్ళల్లోని ద్వేషభావానికి కారణం. టికెట్లు కొన్న ప్రయాణీకులకు కొనని ప్రయాణీకులకు మధ్య ఇలాంటి ఘర్షణ తప్పదేమో! ఆ క్షణంలో వీళ్లంతా 'మేము ప్రయాణీకులం' అనే విషయాన్ని మరచి పోలేదు. అదే సినిమా చూస్తున్నప్పుడు, సినిమాలో ఇలాంటి దృశ్యం చూసినప్పుడు వీళ్లు ప్రయాణీకుల్లా ఆలోచించరు - సహజంగా మానవుల్లో ఉన్న దయ, సానుభూతి, జాలి వాళ్లల్లో ఆ క్షణంలో జాగృతం అవుతాయనుకుంటాను.

నేనిలా ఆలోచిస్తుండగానే టి.టి. గారు ఆమె నడుముకు చెక్కుకున్న చాలా మురికిగా ఉన్న చిన్న సంచీ లాంటి దాన్ని లాక్కున్నాడు.

అందులో వున్న డబ్బంతా కిందపోశాడు. కొన్ని ఒక రూపాయి నోట్లు, కొన్ని ఐదు రూపాయల నోట్లు, మిగతా అంతా చిల్లర - పైస, రెండు పైసలు, మూడు పైసలు, ఐదుపైసలు, పదిపైసలు మొదలైన చిల్లర పైసలు... టి.టి. గారు చకాచకా ఆ డబ్బు లెక్కపెట్టేసి అందులోంచి ఇరవై ఆరు రూపాయలు తీసుకున్నాడు. రెండు పదిపైసలు, మూడు ఐదు పైసలు, పది రెండు పైసలూ తప్ప అక్కడింకేమీ మిగల్లేదు. వాటిని తీసి టి.టిగారితో వున్న అటెండరు ఆమెకివ్వబోయాడు.

''వాట్నికూడా అర్నే తీసుకోమనురి'' అందామె రోషంగా.

ఆ మాటతో టి.టి.గారు కస్సుమని లేచాడు. ''చెప్పు తీసుకుని తంతాను దొంగముండా! నీ మొదనష్టపు బిచ్చమెత్తిన డబ్బు నేనెందుకు తీసుకుంటానే! పుణ్యానికొచ్చిన తిండి తిని బాగా కొవ్వెక్కింది ముండకు. పోలీసులకు అప్పజెప్పి లాకప్‌లో వేయించి నాల్గురోజులు బాగా తన్నిస్తే గాని బుద్ధొస్తుందే మీలాంటి వాళ్లలకు'' అన్నాడు టి.టి.గారు పళ్లు కొరుకుతూ.

బ్రహ్మయ్య వెళ్లి ఆ చిల్లర డబ్బులు తీసుకొని ''ఎడ్డిముండ బాబు.. దానికేమెరుక... చమించండ్రి బాబూ!'' అన్నాడు చేతులు జోడించి.

ఇంతసేపు నిల్చునే మాట్లాడిన టి.టి.గారు నన్ను కొంచెం జరుగమని రిక్వెస్ట్ చేసి నా పక్కన కూర్చొని జేబులోంచి రిసీట్ బుక్‌లాంటిది తీశాడు - పెన్సిల్‌తో చకచకా ఏదో రాశాడు -

ఇంతలో డోర్నకల్ స్టేషన్ వచ్చేసింది.

అతడు రాసిన కాగితాన్ని చించి ''ఇదిగో ఈ రిసీట్ దగ్గరుంచుకుని నెక్కొండలో మీరు దిగినప్పుడు చూపించండి'' అంటూ దాన్ని బ్రహ్మయ్య చేతిలో కుక్కుతుండగా నా దృష్టి ఆ కాగితంమీద పడింది - ''22 రూపాయలు... డోర్నకల్ టు నెక్కొండ'' - అంతవరకే కనిపించింది.

నాకేదో అర్థమైనట్టుగా తోచింది.

ట్రెయిన్ డోర్నకల్ స్టేషన్‌లో ఆగింది.

టి.టి. వెంటనే ఆ కంపార్ట్‌మెంట్‌లోంచి దిగిపోయాడు -

నాకర్థమైన విషయమేమిటో అక్కడ కూర్చున్న ప్రయాణికులందరికీ చెబుదామనుకున్నాను. కాని ఇలాంటివన్నీ ఎంతో మామూలైపోయిన ఈ దేశంలో నేనా విషయాన్ని వాళ్లకు చెప్పడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని నాకు తెలుసు.

చాలాసేపు బ్రహ్మయ్యనుగూర్చి, ఆ రైల్వే అధికారినిగూర్చి ఆలోచిస్తూ ఉండిపోయాను.

ఆ ఇద్దరిలో ఎవడు పెద్ద బిచ్చగాడు? ★

'స్వాతి' జూన్ 1980